ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025



పాట్నా సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం సిద్దరామయ్య తదితరులు


పాట్నా కాంగ్రెస్ సభలోనూ ఓటు చౌర్యంపై
సీఎం ప్రస్తావన

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రం పాట్నాలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలోనూ కర్ణాటకలో ఓటు చౌర్యం అంశాన్ని సీఎం సిద్దరామయ్య ప్రస్తావించారు. బుధవారం సీడబ్ల్యూసీలో సీఎం మాట్లాడుతూ అన్యాయానికి వ్యతిరేకంగా నిరంతరం ఎదురు నిలిచే పాట్నా గడ్డపై కాంగ్రెస్ సభ సంతోషమన్నారు. మన ప్రజాప్రభుత్వం అపాయంలో ఉందన్నారు. రాజ్యాంగ మూలతత్వాలైన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ వారి సిద్ధాంతగురువులైన ఆర్ఎస్ఎస్‌లు భంగం కలిగిస్తున్నాయన్నారు. భారత్ ప్రస్తుతం ఆత్మవంచన నీడలో జీవిస్తోందని, సంస్థలను స్వాధీనం చేసుకుని స్వాతంత్ర్యాన్ని తగ్గిస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో మన ప్రజాస్వామ్య ఆత్మను నాశనం చేసే కత్తికి రెండువైపులా పదును తరహాలో మార్చారన్నారు. ఎన్నికలను దోపిడీ చేయడం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా ఓటుచోరీలో ఉందన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, ప్రజల ధ్వనిని నిర్వీర్యం చేయడం వీరి పని అన్నారు. కర్ణాటకలో మహదేవపుర, అలందలో ఓటు చౌర్యం అంశాన్ని రాహుల్‌గాంధీ బహిరంగం చేశారన్నారు. ఎన్నికల అక్రమాలపై నిరంతర పోరాటం, న్యాయపరమైన ప్రజాప్రభుత్వంపై నమ్మకం కల్గిన ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిచ్చిందన్నారు. ఇటీవల బిహార్‌లో ఎస్ఐఆర్ దుర్మార్గం చూస్తూ బీజేపీ ఏ స్థాయికి దిగజారిందో అర్థమవుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం దేశీయంగా తగ్గుముఖం పడుతున్న సందర్భంలోనే మోదీ ప్రభుత్వం విదేశీ పాలసీలలోనూ విఫలమైందన్నారు. ఒకప్పుడు విశ్వవ్యాప్తంగా భారత విదేశీ పాలసీలకు గౌరవం ఉండేదని, ప్రస్తుతం అధ్వానస్థితికి చేరాయన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కశ్మీర్‌లో శాంతికోసం నేను జోక్యం చేసుకున్నానని చెప్పినప్పుడు ప్రధాని మోదీ ఏమీ మాట్లాడలేదన్నారు. ఇది రాజనీతి కాదని, మనదేశ సార్వభౌమత్వంతో చేసుకున్న రాజీ అన్నారు. కర్ణాటకలో గ్యారెంటీలు అమలు చేసినప్పుడు ఎద్దేవా చేసినవారే ప్రస్తుతం అనుసరిస్తున్నారన్నారు. పాట్నా సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు సీనియర్ నేత బీకే హరిప్రసాద్ ఉన్నారు.

కార్లను అద్దెకు తీసుకెళ్లి అమ్మేశాడు
● ఘరానా మోసగాడిపై పోలీసులకు ఫిర్యాదు 7

అంకెల గారడీ..!

- నగరంలో వార్డుల విభజన
- కూడికతో 9 రావాలనే కసరత్తు
- గతంలోనూ ఇదే ఫార్ములా



బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వాహనాలకు లక్కీ నెంబరు 9గా ఉంటే బాగుంటుందని భావిస్తారు. ఇందుకోసం పోటీపడిన సందర్భాలు ఉన్నాయి. ఒకే ఫ్యాన్సీ నంబరు కోసం ఎక్కువమంది పోటీపడితే లాటరీ తీసిన సందర్భాలు ఉన్నాయి. ఇదంతా వ్యక్తిగతం. ఒక నంబరుకోసం పాకులాడడం, దానిని సెంటిమెంట్‌గా భావించడం వారిష్టానికి సంబంధించినది. అయితే బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) ఉన్నప్పుడు ఇదే విధానాన్ని అధికారులు పాటించారు. ప్రస్తుతం బీబీఎంపీ కొత్త విభజన చేసి గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)గా మార్చారు. అందులో ఐదు నగర పాలికెలను ఏర్పాటు చేశారు. ప్రతి పాలికెలోనూ లక్కీ నెంబరు 9 వచ్చేలా వార్డుల విభజనకు అధికారులు కసరత్తు జరుపుతున్నట్లు సమాచారం.

2006లో బీబీఎంపీ ఏర్పడినప్పుడు 9 లక్కీ నంబరు రావాలని వార్డులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత రెండుసార్లు ఇదే ప్రక్రియ కొనసాగించారు. ప్రస్తుతం ఐదు పాలికెలు కావడంతో ఇదే ఫార్ములను అమలు చేయాలని భావిస్తున్నారు. 450 వార్డులను ఏర్పాటు చేయాలని కసరత్తు చేస్తున్నారు. ఐదు నగర పాలికెలకు 450 వార్డులు అధికమవుతాయని అధికారులు సిబ్బందితోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడం సవాల్ అవుతోందని 360 వార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఐదు నగర పాలికెలకు ఎన్ని వార్డులు ఏర్పాటు చేయాలనే విషయమై ఇటీవల అధికారులు కీలక సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. జీబీఏ పరిధిలో 360, 324, 342, 351, 333, 378, 387, 396, 369 లేదా 432, 423 వార్డులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ప్రతి నగర పాలికెకు 9 టోటల్ వచ్చేలా ఏర్పాటు చేసేందుకు వీలు లేదు. ప్రతి నగర పాలికెలోనూ 150 కంటే తక్కువ వార్డులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. దీంతో ప్రతి నగర పాలికెకు 9 అంకె రావడం అసాధ్యమని, కనీసం గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)లోనైనా మొత్తం వార్డుల సంఖ్యను 9 అంకె వచ్చేలా ఖరారు చేయాలని నిర్ణయించారు.

సాంకేతిక ఆధారిత వార్డుల విభజన

ఐదు నగర పాలికెలకు వార్డుల విభజనకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. మరికొన్ని రోజుల్లోనే వార్డుల విభజనకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ పలు తీర్మానాలు చేసింది. ఈనెల 23న కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం బీబీఎంపీ పరిధిలో 85లక్షల మంది ఉండేవారు. 2023 నాటికి జనాభా ప్రమాణం 1.44 కోట్లకు చేరింది. ప్రస్తుతం మరో 10-15లక్షలు పెరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. నగర పాలికెలలో ప్రతి చదరపు కిలోమీటరు పరిధిలో జనసాంద్రతలో భారీ వ్యత్యాసం ఉంది. 2011లో ఒక వార్డుకు 20వేల మంది ఉండేలా నిర్ణయించారు. వార్డు నుంచి వార్డుకు 25శాతం, అంతకంటే తక్కువ ఉండాలని విభజన చేసేలా ప్రభుత్వం సూచించింది. ఐదు నగర పాలికెలపైకి బెంగళూరు పశ్చిమ పాలికెలో అత్యంత ఎక్కువమంది జనాభా ఉన్నారు.

అప్పుడూ ఇలాగే చేశారు..

సంఖ్యాశాస్త్రానికి అధికారులు ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారని చెప్పలేం. గతంలోనూ పాలికెలో ఇదే విధానం కొనసాగింది. 2006లో బీబీఎంపీ ఏర్పడినప్పుడు 198 వార్డులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పదేళ్లకు బెంగళూరులో విస్తీర్ణం పెరిగినందున పలు ప్రాంతాలను విలీనం చేసుకుని వార్డుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా 2020లో బీజేపీ పాలనలో 243 వార్డులుగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ సంఖ్యను మార్చేసింది. 234 వార్డులకు తీర్మానించింది. అయితే ఈ రెండు ప్రక్రియలలోనూ ఎన్నికలు జరగలేదు. కేవలం వార్డుల విభజన, రిజర్వేషన్ల దాకా వచ్చి ఆగిపోయింది. ప్రస్తుతం వార్డుల విభజనకు సంబంధించి ఈనెల 29న వార్డుల గెజిట్‌ను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. రెండు వారాలపాటు అభ్యంతరాలకు అవకాశం ఉంటుంది. నవంబరు 11న వార్డుల తుది జాబితాను రాష్ట్రప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది.

నగర పాలికె	2011 నాటి జనాభా	2023 ప్రకారం జనాభా	జనసాంద్రత అంచనా ప్రస్తుతం (చ.కి.మీ)
బెంగళూరు తూర్పు	9లక్షలు	13 లక్షలు	7,738
బెంగళూరు పశ్చిమ	26 లక్షలు	45 లక్షలు	27,950
బెంగళూరు సెంట్రల్	15 లక్షలు	25 లక్షలు	32,051
బెంగళూరు ఉత్తర	18 లక్షలు	31 లక్షలు	19,620
బెంగళూరు దక్షిణ	17 లక్షలు	30 లక్షలు	20,408

జలమండలి చైర్‌పర్సన్‌గా
శివలీలా కులకర్ణి



బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జలమండలి చైర్‌పర్సన్‌గా ధారవాడ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి భార్య శివలీలా కులకర్ణిని నియమించారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా వాయిదాలు పడుతూ వస్తున్న బోర్డులు, కార్పొరేషన్లకు ఎట్టకేలకు చైర్మన్ల నియామకం జరిగింది. పాట్నాలో సీడబ్ల్యూసీ సభలో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీతో చర్చలు జరిపి 39 కార్పొరేషన్లకు చైర్మన్ల జాబితాకు గ్రీన్‌సిగ్నల్ పొందారు. ఇదే జాబితాను బుధవారం విడుదల చేశారు. సఫాయి కర్మచారి చైర్మన్‌గా పీ రఘు, వాయువ్య ఆర్టీసీ చైర్మన్‌గా అరుణ్ పాటిల్, పర్యావరణ మండలి - జగదీశ్ పట్నాల్, సఫాయి కర్మచారి అభివృద్ధి మండలి - మురళి అశోక్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ మూర్తి, మాజీ సైనికుల సంక్షేమం - కల్నల్ మల్లికార్జున, మామిడి అభివృద్ధి మార్కెటింగ్ కమిటీ - డాక్టర్ బీసీ ముద్దుగంగాధర్, పర్యాటక మండలి - శర్లైట్ పింటో, మరాఠా కార్పొరేషన్ - మరియోజి రావ్, తీరప్రాంత అభివృద్ధి - ఎంఏ గఫూర్, మంగళూరు విద్యుత్ కార్పొరేషన్‌కు హరీశ్‌కుమార్, గోడౌన్ల కార్పొరేషన్‌కు ఎన్ సంపంగి, దేవరాజ్ అరసు ట్రక్ టర్మినల్ - వై సయీద్‌తోపాటు పలువురిని నియమించారు.



విద్యారణ్యపుర కాళికా దుర్గాపరమేశ్వరికి మహేశ్వరి అలంకరణ

సాహితీ దిగ్గజం భైరప్ప కన్నుమూత

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య రంగంలో తిరుగులేని వారిగా రచనలతో అన్నివర్గాలను ఆకట్టుకున్న సాహితీ దిగ్గజం సంతె శివర లింగణ్ణయ్య (ఎస్ఎల్) భైరప్ప (94) కన్నుమూశారు. మైసూరులో నివసిస్తున్న భైరప్ప వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండేవారు. ఇటీవల కొంతకాలంగా బెంగళూరులోనే ఉంటున్నారు. రాజరాజేశ్వరినగర్‌లోని రాష్ట్రోత్థాన ఆసుపత్రిలో కొన్నిరోజులుగా చికిత్సలు పొందుతున్న భైరప్ప బుధవారం మధ్యాహ్నం 2.38 గం టలకు తుదిశ్వాస వీడారు. ఈమేరకు ఆసుపత్రి ఒక ప్రత్యేక బులెటిన్ విడుదల చేసింది. భైరప్ప కన్నుమూశారనే సమాచారంతో కన్నడ సాహి తీ అభిమానులు, కవులు, రచయితలతోపాటు ఉన్నత విద్యాశాఖలోని అధికారులు, అధ్యాపకులు నిట్టూర్చారు. ఆసుపత్రికి ఎమ్మెల్యే మునిరత్న, విశ్వవాణి ఎడిటర్ విశ్వేశ్వరభట్, మైసూరు మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ తదితరులు చేరుకుని పార్థివదేహానికి నివాళులు అర్పించారు.



ఎస్ఎల్ భైరప్ప (ఫైల్)

హాసన్ జిల్లా చన్నరాయపట్టణ తాలూకా సంతె శివర గ్రామంలో 1934 ఆగస్టు 20న లింగణ్ణయ్య, గౌరమ్మ దంపతులకు జన్మించారు. బాగూరు, నుగ్గేహళ్ళిలలో ప్రాథమిక విద్య ముగించి మైసూరులోని శారదా విలాస్‌లో హైస్కూల్ చదివారు. మహారాజ కళాశాలలో బీఏ, మైసూరు యూనివర్సిటీలో 2 బంగార పతకాలు సాధించి ఎంఏ ఫిలాసఫీ పూర్తి చేశారు. బరోడాలోని సయ్యాజిరావ్ యూనివర్సిటీలో సత్య - సౌందర్య వ్యాసం సమర్పించి పీహెచ్‌డీ పొందారు. 1958లో హుబ్బళ్ళిలోని కాడుసిద్దేశ్వర కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. 1960 నుంచి ఆరేళ్లపాటు గుజరాత్‌లోని సర్దార్‌వల్లభాయ్‌పటేల్ యూనివర్సిటీలో అధ్యాపకులుగా సేవలందించారు. 1967 నుంచి నాలుగేళ్లపాటు ఢిల్లీలోని నేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ సెంటర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగారు. 1991లో మైసూరులోని రీజనల్ ఎడ్యుకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ పొందారు.

నేడు రవీంద్రకళాక్షేత్రలో..

సాహితీవేత్త ఎస్ఎల్ భైరప్ప పార్థివదేహాన్ని సందర్శించేందుకు రవీంద్ర కళాక్షేత్రలో ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి నేరుగా రవీంద్ర కళాక్షేత్రకు 8 గంటలకు పార్థివదేహాన్ని తీసుకురానున్నారు. అక్కడ సాహితీ అభిమానులతోపాటు ప్రజల సందర్శనకు అవకాశం ఉంది. మధ్యాహ్నం 1గంటకు మైసూరుకు తరలిస్తారు. అక్కడ కళామందిరంలో 3 గంటలనుంచి 6 వరకు ప్రజల సందర్శనకు అవకాశం కల్పిస్తారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపనున్నారు.

భైరప్ప రచనలతో సినిమాలు

భైరప్ప రచనలు సామాన్యులనుంచి సాహితీ పండితులదాకా ఆకట్టుకునేలా ఉండేవి. ఓవైపు ఆయన నవలలు ప్రజాదరణ పొందుతుండగానే సినిమాలుగా రూపొందాయి. 1972లో వంశవృక్ష నవల సినిమాగా వచ్చింది. డాక్టర్ విష్ణువర్ధన్‌కు ఇది తొలిసినిమా కాగా జ్ఞానపీఠ గ్రహీత గిరీశ్‌కర్నాడ్, బీవీ కారంత్‌లు దర్శకత్వం వహించారు. వీరి దర్శకత్వంలోనే తబ్బలియ నీనాద మగనె నవల ఆధారంగా 1977లో గోధూళి పేరిట సినిమా రూపొందగా నసీరుద్దీన్ షా, ఓంపురి, టీఎస్ నాగాభరణ వంటి వారు నటించారు. 1965లో భైరప్ప రచించిన 'మతదాన' (ఓటుహక్కు) నవల 2001లో అనంత్‌నాగ్, దేవరాజ్, తార, ప్రకాశ్ బెళవాడి వంటి ప్రముఖ నటులతో సినిమాగా వచ్చింది. నాయి నెరళు నవల ఆధారంగా గిరీశ్ కాసరవళ్ళి దర్శకత్వంలో అదే పేరుతో సినిమా రూపొందించగా పవిత్రలోకేశ్ ముఖ్యపాత్రలో పోషించి ఉత్తమనటిగా ఎంపికయ్యారు. గృహభంగ నవల సీరియల్ రూపంలో 2004-05లో కొనసాగింది. ఇందులో మాళవిక అవినాశ్‌తోపాటు నటి సౌందర్య కూడా నటించి పేరొందారు. భైరప్పకు 1975లో దాటు నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 2010లో మంద్ర నవలకు సరస్వతి సమ్మాన్ పురస్కారం, 2015లో అత్యున్నతమైన సాహిత్య అకాడమీ ఫెలోషిప్, 2023లో అత్యున్నత పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.

పలువురి సంతాపం

ఎస్ఎల్ భైరప్ప మృతి పట్ల రాజకీయ ప్రముఖులు, సాహితీవేత్తలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాట్నా నుంచే ఓ సందేశాన్ని పంపారు. ఎస్ఎల్ భైరప్ప కన్నడ సాహిత్యంలో తిరుగులేని రచనలు చేశారన్నారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె, సోమణ్ణ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని దేవేగౌడ, డీసీఎం డీకే శివకుమార్, మాజీ సీఎంలు సదానందగౌడ, బసవరాజ్ బొమ్మై, జగదీశ్ శెట్టర్, మంత్రులు శివరాజ్ తంగడిగ, దినేశ్ గుండూరావు, పరమేశ్వర్ తదితరులు సంతాపం తెలిపారు.



భైరప్పకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మునిరత్న

ప్రధానమంత్రితో సాన్నిహిత్యం

భైరప్ప పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక అభిమానం చూపేవారు. గత ఏడాది పద్మభూషణ్ పురస్కారం పొందేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. అప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. ప్రధాని భైరప్పను నమస్కరించారు. అంతలోనే భైరప్ప నేను కర్ణాటక వాసినని, రచయితనని చెప్పారు. మోదీ సర్, మీరంటే ఎవరికి తెలియదు. సాహిత్య అభిమానం ఉండే దేశంలోని ప్రతి ఒక్కరికీ మీ గురించి తెలుసు అన్నారు. ప్రస్తుతం ఏం పుస్తకం రాస్తున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంలో ప్రస్తుతానికి ఏ పుస్తకం రాయడం లేదని భైరప్ప వివరించారు. దయచేసి మీరు రచనలను ఆపకండి సర్, దేశమంతటా మీ సాహితీ అభిమానులు ఉన్నారు. మీ పుస్తకాలలోని జ్ఞానాన్ని ఆకర్షిస్తున్నారు అంటూ ప్రధాని తెలిపారు. ఇదే విషయాన్ని ఎస్ఎల్ భైరప్ప సందర్భంలో వివరించారు. ప్రధానమంత్రి మోదీ పట్ల ప్రత్యేక అభిమానం చూపేవారు భైరప్ప. సాహితీలోకంలో తాను ఏకాంగి అని, అయితే మోదీ తరపున ఉన్నానని, గుజరాత్‌లో కొన్నేళ్లు పనిచేసినప్పుడు అక్కడి ప్రజలకు ఏం కావాలో ఆలోచించి ముఖ్యమంత్రిగా ఎన్నో పనులు చేశారని కొనియాడారు. ఎస్ఎల్ భైరప్ప మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ ద్వారా సంతాపం తెలిపారు. ఆయనో సాహితీ దిగ్గజమని, ఆయన రచనలు సమాజానికి స్ఫూర్తినిస్తాయని కొనియాడారు.



ప్రధాని నరేంద్రమోదీతో భైరప్ప (ఫైల్)

అలరించిన బొమ్మల కొలువులు

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బొమ్మల కొలువు అనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. పూర్వీకులు సంప్రదాయాలను నేటితరం కొనసాగిస్తూ బొమ్మలను అందంగా అలంకరించి నిత్యపూజలు చేస్తారు. బొమ్మల కొలువుకు ఓ చరిత్ర ఉంది. 9 వరుసలతో దేవుళ్ల బొమ్మలను వరుస క్రమంలో అమర్చాలి. అందులో ప్రతి వరుసకు ఓ కథ ఉండేలా రూపకల్పన చేయాలి. మహాభారతం, భాగవతం, శ్రీనివాసకల్యాణం, విష్ణు అవతరాలు, అష్టలక్ష్మీతోపాటు ఇలా ప్రతి వరుస క్రమంలోని బొమ్మ ఓ కథను వివరించేలా ఉండాలి. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించే ముందురోజే వరుసక్రమంగా బొమ్మలను సిద్ధం చేసుకోవాలి. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన రోజే పైనుంచి రెండో వరుసలో కలశం ఏర్పాటు చేసి బొమ్మలను అమర్చాలి. నవరాత్రులు రోజుకు మూడుసార్లు పూజ, హారతి, నైవేద్యం సమర్పించాలి. సాయంత్రం సంగీతం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించి సమీపంలోనివారికి పసుపు, కుంకుమ ఇవ్వాలి. వీటన్నింటితోపాటు బంధుమిత్రులను ఆహ్వానించి బొమ్మల కొలువు వద్ద పూజలు జరిపించాలి. నవరాత్రులు అంటే కేవలం శక్తి దేవతలకు పూజలతోపాటు బంధుమిత్రులకు ఆహ్వానించి సంబంధాలను మరింత స్నేహపూర్వకం చేసుకునే వేడుక బొమ్మల కొలువు. బెంగళూరు నగరంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకర్షణీయంగా ఉన్నాయి. మల్లేశ్వరం గంగమ్మ ఆలయం, వసంతపురలోని మంజుళ నివాసం, పూర్ణప్రజ్ఞ లే అవుట్, జేపీ నగర్‌లోని రిటైర్డు ఏసీటీఓ లలిత నివాసం, కత్రిగుప్పెలోని శ్రీనివాస్ ఇంట ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



జేపీ నగర్‌లోని విశ్రాంత ఏసీటీఓ లలిత నివాసంలో బొమ్మల కొలువు



పూర్ణప్రజ్ఞ లే అవుట్‌లో బొమ్మల కొలువు



మల్లేశ్వరం గంగమ్మ గుడిలో బొమ్మల కొలువు



వసంతపుర మంజుల నివాసంలో




కత్రిగుప్పెలో శ్రీనివాస్ నివాసంలో బొమ్మలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ (జయంతి)




ప్రముఖ మేధావి, రాజకీయ నేత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబరు 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధురలో జన్మించారు. హిందుత్వ భావాలను ప్రచారం చేసేలా ఆర్ఎస్ఎస్‌కు అనుబంధమైన 'రాష్ట్ర ధర్మ' మాస పత్రికను 1940లో స్థాపించారు. భారతీయ జన సంఘ్ (బీజేఎస్)లో ప్రముఖ నేతగా ఎదిగి పదో అధ్యక్షుడిగా వ్యవహరించారు. అనంతరం భారతీయ జనతా పార్టీగా మారింది. 1968 ఫిబ్రవరి 11న కన్నుమూశారు. కాగా 2020 ఫిబ్రవరి 16న 63 అడుగుల భారీ విగ్రహాన్ని వారణాసిలో ఆవిష్కరించారు.

ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత కొత్త సచ్చిదానందమూర్తి 1924 సెప్టెంబరు 25న గుంటూరు జిల్లా సంగం జాగర్లమూడి గ్రామంలో జన్మించారు. ఫిలాసఫీ (తత్వశాస్త్ర) ప్రొఫెసర్‌గా విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీలో పనిచేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీకి వైస్-ఛాన్సెలర్‌గా, యూజీసీ వైస్‌చైర్మన్‌గాను వ్యవహరించారు. ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత. విద్య, సాహిత్య సేవలకుగాను పద్మశ్రీ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 2011 జనవరి 25న కన్నుమూశారు.

క్రిస్టోఫర్ రీవ్ (జయంతి)



అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు క్రిస్టోఫర్ రీవ్ 1952 సెప్టెంబరు 25న న్యూయార్క్‌లో జన్మించారు. డీసీ కామిక్స్ కేరక్టర్ 'సూపర్‌మ్యాన్'తో పేరొంది బీఏఎఫ్‌టీఏ అవార్డు అందుకున్నారు. అంతేకాక రచయితగా, అథ్లెట్‌గా రాణించారు. గుర్రపుస్వారీ ప్రమాదంతో చాలాకాలం వీల్‌చెయిర్‌కే పరిమితమయ్యారు. వెన్నెముక బాధితులను ఆదుకునేలా ప్రత్యేక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. 2004 అక్టోబరు 10న కన్నుమూశారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ (వర్ధంతి)



గాంధేయవాది, సంఘ సంస్కర్త ఉన్నవ లక్ష్మినారాయణ 1877 డిసెంబరు 4న గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూడు గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడిగా పేరొందారు. సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేసిన న్యాయవాది. కవిత్వం ప్రజలకు అర్థమయ్యే వాడుకభాషలో ఉండాలన్నది ఉన్నవ అభిలాష. ఆయన రచించిన 'మాలపల్లి' నవల సంచలనం సృష్టించింది. 1958 సెప్టెంబరు 25న కన్నుమూశారు.

ఎస్‌పీ బాలసుబ్రమణ్యం (వర్ధంతి)



ప్రముఖ నేపథ్యగాయకుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4న నెల్లూరులో జన్మించారు. ఎస్‌పీబీగాను, బాలుగాను సుపరిచితులు. గాయకుడిగానే కాక సంగీత దర్శకుడు, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బుల్లితెర కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో 40వేలకు పైగా పాటలు పాడారు. 6 జాతీయ పురస్కారాలు, 25 నంది అవార్డులు, పద్మశ్రీతోపాటు పలు ఫిల్మ్‌ఫేర్, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2020 సెప్టెంబరు 25న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మ విభూషణ్' ప్రకటించారు.

పరుచూరి గోపాలకృష్ణ (పుట్టినరోజు)



'పరుచూరి బ్రదర్స్'లో ఒకరైన చిన్నవారు పరుచూరి గోపాలకృష్ణ 1947 సెప్టెంబరు 25న కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామంలో జన్మించారు. అన్న వెంకటేశ్వరరావుతో కలసి 350కుపైగా తెలుగు సినిమాలకు కథ, స్క్రీన్ ప్లే అందించారు. దర్శకత్వం చేసిన తొలి సినిమాకే నంది అవార్డు అందుకున్నా ఎన్టీఆర్ సలహా మేరకు రచనారంగానికే పరిమితమయ్యారు. వర్ధమాన రచయితలకు బోధనలు చేస్తున్నారు. జీవిత సాఫల్య పురస్కారం సహా పలు అవార్డులు అందుకున్నారు.

రాహుల్ శర్మ (పుట్టినరోజు)



సంగీత దర్శకుడు, క్లాజికల్ సంతూర్ వాయిద్యకారుడు రాహుల్ శర్మ 1972 సెప్టెంబరు 25న ముంబైలో జన్మించారు. తండ్రి శివకుమార్ శర్మ వద్దనే సంగీతం నేర్చుకున్నారు. 'నమస్తే ఇండియా' ఆల్బమ్ ఎంతో పేరొందింది. 60కుపైగా ఆల్బమ్స్ రూపొందించారు. జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో కలసి పనిచేశారు. 1996 నుంచి కచేరీలు ప్రదర్శిస్తున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు.

హోరెత్తించిన వాన

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా వాన హోరెత్తించింది. బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య పలుచోట్ల వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం రావడంతో నగర ప్రజలు తడిసిముద్దయ్యారు. మరోవైపు ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. నగరమంతటా ఇదే పరిస్థితి కొనసాగింది. సాయంత్రం 5 గంటలకు మరోసారి పలు ప్రాంతాలలో వర్షం కురిసింది.



వర్షపునీటిలో వాహనదారుల ఇబ్బందులు

నగరంలో దసరా వైభవం



బెంగళూరు బనశంకరి మాతకు పండ్ల అలంకరణ



జలమండలి ఆధ్వర్యంలో దుర్గాదేవికి పూజలు



గిరినగర్ వాసవీమాతకు చంద్రప్రభ అలంకరణ



మల్లేశ్వరం గంగమ్మదేవికి విశేష పూజలు



దొడ్డగొడనపాళ్యలో దుర్గమ్మ దేవి



దొడ్డజాల ముత్యాలమ్మదేవికి మిఠాయిలతో అలంకరణ

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు, స్థానికులు



కేరళ కళాకారుల బృందం

విజయపుర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని గాంధీచౌక్‌లో వినాయక భక్తమండలి ఆధ్వర్యంలో 90వ వార్షిక గణేశ నిమజ్జన ఉత్సవం ఘనంగా జరిగింది. మహారాష్ట్ర సాంగ్లి ప్రాంతానికి చెందిన కళాకారులు పాల్గొన్నారు. డొళ్ళుకుణిత, కేరళలో పేరొందిన చండి కళాకారులు, కావడి కుణిత, రామనగర మానవి జానపద కళాసంస్థ పార్థసారథి బృందాలు ఉత్సవంలో పాల్గొన్నాయి. 9 దేవతల పూజాకుణిత, గరుడవాహనంపై కొలువుదీరిన వినాయకుడు, మార్కెట్‌రోడ్డులోని వృషభ వాహనంపై గణపతి తదితర మూర్తులను పురవీధులలో ఊరేగించారు. నెలరోజులపాటు ప్రతిరోజూ విశేషపూజలు కొనసాగించారు. వినాయకస్వామి భక్తమండలి అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారి రాజశేఖర్, నగరేశ్వరస్వామి సేవా ట్రస్టు అధ్యక్షుడు పునీత్‌కుమార్, ప్రగతి హైస్కూల్ హెచ్ఎం బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహదేవపుర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీఎస్టీ పన్నుల భారం తగ్గించిన అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని కేఆర్‌పుర హోబళి బీజేపీ అధ్యక్షుడు మునేగౌడ అభిప్రాయపడ్డారు. స్థానిక కట్టె వినాయక దేవాలయంలో బుధవారం విశేష పూజల అనంతరం ఆయన మాట్లాడారు. పేదలు, మధ్యతరగతి వర్గాలకు పన్ను టభారం కొంతమేర తగ్గనుందన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భైరతి బసవరాజ్ సూచన మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా జాగృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఔషధాలు, నిత్యావసరాలపై కొంతమేర పన్ను తగ్గిందన్నారు. పొదుపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హోబళి బీజేపీ ప్రధాన కార్యదర్శి నాగేనహళ్ళి లోకేశ్, మార్కెట్ రమేశ్, శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు గౌరమ్మ, మాజీ కార్పొరేటర్ ఆంటోనీస్వామి, శమంత్, శివప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సభ్యత్వానికి రాజీనామా

దొమ్మసంద్ర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా భూస్వాధీన పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు విశ్వనాథ్ కే ముత్తనల్లూరు గ్రామ పంచాయతీ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా లేఖను గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నాగరత్న కాంతరాజుకు అందచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల పోరాటం కోసం తన సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. 77 రోజులుగా రాత్రింబవళ్లు తేడా లేకుండా రైతులు భూమికోసం పోరాటం చేస్తున్నారు. కేఐఏడీబీ భూస్వాధీన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి, మంత్రికి, జిల్లా అధికారి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. రెండు నెలలు గడిచినా కనీస స్పందన లేకపోవడంతో మనస్తాపానికి లోనై పంచాయతీ సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నప్ప చిక్కహెగడె, డైరి మాజీ అధ్యక్షుడు గురుమూర్తిరెడ్డి, రైతు నాయకుడు రాజేశ్, సునీల్, పవన్, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా లేఖను అందజేస్తున్న విశ్వనాథ్

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బొమ్మనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవమయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా మునిరాజు, ఉపాధ్యక్షులుగా బీవీ శ్రీనివాసమూర్తి గెలుపొందారు. అందరూ కలసికట్టుగా ఉండడంతో ఏకగ్రీవం సాధ్యమైందని ఎన్నికల అధికారి మంజునాథ్ ప్రకటించారు. నూతన పదాధికారుల ఎంపికతో పూలమాలలతో సత్కరించి, బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా సంఘం డైరెక్టర్‌లు చన్నకృష్ణప్ప, జయదేవేగౌడ, ఆనంద్, దేవరాజ్, మునిశామప్ప, నారాయణస్వామి బీఎం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పదాధికారులతో అధ్యక్ష, ఉపాధ్యక్షులు

కార్లను అద్దెకు తీసుకెళ్లి అమ్మేశాడు

- ఘరానా మోసగాడిపై పోలీసులకు ఫిర్యాదు

బళ్లారి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మీతో కారు ఉందా..? బాడుగకు ఇవ్వాలనుకుంటున్నారా? నాకు చెప్పండి. నాకు చాలా పెద్దపెద్ద కంపెనీల వారితో పరిచయం ఉంది. నేను అందులో మీ కారును బాడుగకు పెట్టిస్తాను. మీకు నెలనెలా రెంట్ ఇప్పిస్తానని కారు యజమానులను నమ్మిస్తాడు. జిందాల్, కిర్లోస్కర్, బీఎంటీ, ఎన్ఎండీసీ లాంటి పెద్ద పెద్ద కంపెనీల పేర్లు దారాళంగా వాడుతాడు. కొత్త కారు బాడుగకు పెడితే నెలకు రూ.65వేలు, ఏడాది గడిచిన కారు పెడితే రూ.50 వేలు ఇలా రేటు అతనే చెబుతాడు. కారుబాడుగ ముందు రెండుమూడు నెలలు ఠంచనుగా యజమాని అకౌంట్‌లలోకి డబ్బు జమచేస్తాడు. ఆ తరువాతే అతను మోసగాడని యజమానికి అర్థమవుతుంది. కార్లు బాడుగకు పెట్టిస్తానని చెప్పి అవి కనిపించకుండా చేశాడని, మోసపోయామని తెలుసుకున్నాక అందరూ పోలీస్టేషన్‌కు వస్తున్నారు. కార్లు బాగుడ పేరుతో ఘరానా మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ల వద్ద బాధితులు బారులుతీరారు. ఈ మోసం కథ వింటున్న పోలీసులు కూడా నివ్వెరపోతున్నారు. అసలు ఆ మోసగాడు ఎవరు.. మోస పోయిన బాధితులు ఎంతమంది అంటారా..? వివరాలు ఇలా...



ఎండీ జావేద్ బాషా (సోనూ)

కర్ణాటకలోని రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన ఎండీ జావేద్ బాషా, అలియాస్ సోనూ బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పళ జిల్లాల్లో తిరుగుతుంటాడు. ఆయా ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల్లో వివిధ హోదాల్లో పనిచేసే వారికి, అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు బాడుగలకు కార్లు పెట్టిస్తానని, కార్లు నెలనెల ఒక రేటు కట్టి బాడుగకు పెట్టిస్తాడు. కారు ఓనర్‌తో ఇతనే మొత్తం డీల్ చేస్తాడు. ముందు రెండుమూడు నెలలు కారు ఓనర్లకు సక్రమంగా బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేస్తాడు. తరువాత బాడుగ వేకుండా మోసం చేస్తాడు. కొన్ని కార్లు కనిపించకుండా స్క్రాప్‌కు కూడా వేశాడు. ఈ ఘరానా మోసగాడి చేతిలో మోసపోయిన కార్ల యజమానులు బుధవారం నాటికి 150 మంది అయ్యారు. బళ్లారి బ్రూస్‌పేట పోలీస్టేషన్‌లో బుధవారం 70 మంది కార్ల యజమానులు అతనిపై ఫిర్యాదు చేశారు. కౌల్‌బజార్, గాంధీనగర్, రూరల్ పోలీస్టేషన్ల అలాగే విజయనగర, రాయచూరు జిల్లాల్లోని పోలీస్టేషన్లలో బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ కార్ల బాడుగ పేరుతో తీసుకుని మోసం చేశాడని జిల్లాలోని అన్ని పోలీస్టేషన్లలో ఫిర్యాదులు వస్తున్నాయి. బుధవారం సాయంత్రానికి 150 మంది వరకు ఫిర్యాదులు చేశారు. ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ ఓనర్లతో బాడుగకు తీసుకుని సరిహద్దు జిల్లాలోని కొందరి పేకాట ప్రోత్సహించేవారికి కూడా అమ్మినట్లు ఎస్పీ తెలిపారు. రాయదుర్గం, మెల్కాల్మూరు, చెల్లకెర, ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో ఈ కార్లు ఉన్నట్లు సమాచారం ఉందని ఎస్పీ తెలిపారు.

3న వినికిడి పరికరాల పంపిణీ

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంవాద్ వాక్ శ్రవణ సంస్థ, బెంగళూరు ఏఎల్ఐఎంసీఓ సహకారంతో వినికిడి సమస్యతో బాధ పడుతున్న వారికి ఉచితంగా వినికిడి పరికరాలు పంపిణీ చేయనున్నారు. అక్టోబరు 3న ఇందుకుగాను ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నారు. మరిన్ని వివరాలకు హెబ్బాళ పోలీస్ స్టేషన్ సమీపాన ఆనందగిరి ఎక్స్‌టెన్షన్‌లోని ట్రస్టు కార్యాలయాన్ని సందర్శించాలని, 96633 88623కు సంప్రదించాలని ట్రస్టీ రాధికా పూవయ్య ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైనవారు ఆధార్‌కార్డు, యూడీఐడీ (యూనిక్ డిజబిలిటీ) కార్డు, బీపీఎల్ కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు సమర్పించాలని పేర్కొన్నారు.

లక్షమందికి న్యూరో విభాగంలో చికిత్సలు

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలకాలంలో లక్షమందికి న్యూరాలజీ చికిత్సలు విజయవంతం చేశామని నారాయణ హెల్త్‌సిటీ సీనియర్ కన్సల్టెంట్ గోపాలకృష్ణదాస్ అభిప్రాయపడ్డారు. మంగళవారం నగరంలో వైద్యులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రెయిన్ అండ్ న్యూరో విభాగంలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందామన్నారు. అత్యాధునిక చికిత్సా సామర్థ్యం, ఆధునాతన సాంకేతిక విధానాలు అవలంబిస్తున్నట్టు తెలిపారు. 21ఏళ్ల యూనివర్సిటీ విద్యార్థినికి సీజర్స్ సమస్య తలెత్తగా ప్రాథమికంగా ఇతర ఆసుపత్రులలో పరిశీలించుకుని నారాయణలో చేరారన్నారు. పరీక్షల తర్వాత రీఫ్రాక్టరీ స్టేటస్ ఎపిలెప్టికస్ అనే సమస్య ఉన్నట్టు గుర్తించామన్నారు. న్యూరాలజిస్టులు, క్రిటికల్ కేర్ విభాగం చికిత్సలతో సాధారణ జీవనానికి అనుకూలం చేశారన్నారు. సీజర్స్ ఐదు నిమిషాలకంటే ఎక్కువగా ఉంటే అది మెడికల్ ఎమర్జెన్సీగా భావించాల్సి ఉంటుందన్నారు. స్పెషలిస్ట్ కులదీప్‌శెట్టి, విక్రమ్ హుడేద్‌లు వారు చికిత్సలు అందించిన అనుభవాలను వివరించారు.

ఎకో వరల్డ్‌లో సాంస్కృతిక సంబరం

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎకోవరల్డ్‌లో సాంస్కృతిక సందడి జరిగింది. బ్రూక్‌ఫీల్డ్ ప్రాపర్టీ వార్షిక ఉత్సవాన్ని సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించింది. జెయింట్ జంగా, బుల్‌టెరాన్, టాటూ బూత్‌తో పాటు జర్మన్ బ్రాజిల్ హౌస్, రోమాతోపాటు పలు ప్రజాదరణ పొందిన బ్రాండ్ల ఆహార పదార్థాల కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భాగస్వామ్యులయ్యారు.

ఐపీఓలోకి మరో ఆహార సంస్థ

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు, సముద్రపు ఆహార వ్యాపారంలో పేరొందిన డీఎస్ఎం ఫ్రెష్‌ఫుడ్ సంస్థ పబ్లిక్ ఇష్యూలోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఐపీఓ ఈనెల 26న ఓపెన్ కానుండగా 30వ తేదీన ముగింపు ఉంటుందని ప్రకటించారు. ఇందుకు సంబంధించి బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు డీఎస్ఎం ఫ్రెష్‌ఫుడ్ లిమిటెడ్ జాప్ ఫ్రెష్ పేరిట వ్యాపారాలు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి 10 రూపాయల ఈక్విటీ షేర్ ప్రైజ్ రూ.96 నుంచి 101గాను, ప్రతి రెండు బిడ్ లాట్‌లకు 1200 ఈక్విటీ షేర్లకు అవకాశం ఉన్నట్టు ప్రకటించారు.

డిసెంబరులో కామిక్‌కాన్ ప్రదర్శనలు

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కామిక్‌కాన్ ఇండియా అద్భుతమైన పాప్ కల్చర్ సెలెబ్రేషన్స్ నిర్వహించేందుకు సిద్ధమైంది. డిసెంబరు 20 నుంచి రెండురోజులపాటు వైట్‌ఫీల్డ్‌లోని కేటీపీఓలో ఏర్పాటు చేశారు. 13వ ఎడిషన్ కామిక్‌కాన్ ఇండియా ప్రదర్శనలు సిలికాన్ వ్యాలీ బెంగళూరుకు రానున్నాయి. క్రియేటర్స్‌కు ఓ ప్లాట్‌ఫాంగాను, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్‌కు ఇదో వేదిక కానుంది, కామిక్‌కాన్ కో-ఫౌండర్ అక్షత్ రాతె మాట్లాడుతూ ఏడాది ఆఖరులో నగర ప్రజలు సంబరం చేసుకునేలా ప్రదర్శనలు ఉంటాయన్నారు. సీఈఓ షెఫాలి జాన్సన్ మాట్లాడుతూ బెంగళూరు కామిక్‌కాన్‌వైపు ఆసక్తిగలవారిని తీసుకెళ్తోందన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటుకు డిమాండ్



బస్టాండ్ ప్రదేశం

చేళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఎం నల్లగుట్లపల్లి గ్రామపంచాయతీ కేంద్రంలో ప్రయాణీకుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చేళూరు నుంచి పది కిలోమీటర్ల దూరంలో పాతపాలెం-బాగేపల్లి మార్గంలో ఎం నల్లగుట్లపల్లి ఉంది. స్థానికంగా ప్రయాణీకులతోపాటు విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో రోడ్డు సమీపాన ఉండే దుకాణాల వద్ద వేచియుండాల్సి వస్తోందని, బస్టాండ్ ప్రదేశంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో అనుకూలం కాగలదని పలువురు కోరుతున్నారు.

ప్రతిష్టాత్మక విద్యాసంస్థపై ఐటీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు కేంద్రంగా కొనసాగుతున్న ప్రతిష్టాత్మక విద్యాసంస్థ పీఈఎస్ యూనివర్సిటీపై ఐటీ దాడులు జరిగాయి. సుమారు 150మందికిపైగా అధికారులు ఏకకాలంలో 40 ప్రాంతాలలో బుధవారం ఉదయం దాడులు కొనసాగించారు. బనశంకరిలోని చాన్సలర్ నివాసంతోపాటు రింగ్‌రోడ్డులోని యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్‌సిటీలోని ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలతో కలిపి చిత్తూరు జిల్లా కుప్పంలోని మెడికల్ కళాశాలలోనూ దాడులు నిర్వహించారు. కళాశాలకు సంబంధించిన ఆర్థిక వివరాలు, విద్యార్థులనుంచి వసూలుచేసే ఫీజులు, మౌలిక సదుపాయాలకోసం చేసిన ఖర్చులు వంటి వివరాలను ఆరా తీసినట్టు తెలుస్తోంది. విద్యాసంస్థ డైరెక్టర్లను ఆరా తీసినట్టు తెలుస్తోంది. అయితే ఐటీ అధికారులు ఏ విధమైన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు లేదా ఇతరత్రా వివరాలను ప్రకటించలేదు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,551	7,980
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,346	10,153
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.54

రుద్రాక్ష అలంకరణలో ఎర్రితాత స్వామి



బళ్లారి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని చేళగుర్కి ఎర్రితాత స్వామికి నవరాత్రుల సందర్భంగా రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలకరించారు. నవరాత్రుల సందర్భంగా ఆలయానికి భక్తాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

29న కేడీపీ ప్రగతి సమీక్ష సమావేశం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక అభివృద్ధి కార్యక్రమాల (20అంశాలతోసహా) మొదటి త్రైమాసిక కేడీపీ పురోగతి సమీక్ష 29వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ తెలిపారు. కార్యక్రమం నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి గృహనిర్మాణం, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన నేగిలీ యోగి నాటిక



నేగిలీ యోగి నాటికలోని ఓ సన్నివేశం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పటేల్‌నగర్ చిన్నదుర్గమ్మ దేవస్థానం ఆవరణలో మంగళవారం రాత్రి ప్రదర్శించిన నేగిలీ యోగి నాటిక ప్రేక్షకులను అలరించింది. జేడీఎస్ జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ మాట్లాడుతూ కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలన్నారు. అనంతరం తుంగ-గంగా కళాట్రస్టు కళాకారులు రామచంద్ర దర్శకత్వంలోని నేగిలీ యోగి ప్రదర్శన ప్రేక్షకులను రంజింపచేసింది. రాధాకృష్ణ బృందం చేసిన నృత్యప్రదర్శన తన్మయపరిచింది. కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, కిట్టు, సునీల్, రమేశ్, జీర్ వెంకటేశులు, నాగభూషణం పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్లకు అవగాహన



మేనేజర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కాళింగ

బళ్లారిరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం సాయంత్రం మోకా ఎస్‌ఐ కాళింగ నేతృత్వంలో బ్యాంకు మేనేజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ క్రైమ్ పట్ల బ్యాంకుకు వచ్చివెళ్లే వారి పట్ల శ్రద్ధవహించాలి. అనుమానం వచ్చిన వారిపై పోలీసులకు సమాచారం అందించాలని బ్యాంకు లావాదేవీలపై పలు విషయాలు వివరించారు. బ్యాంకు మేనేజర్లు మోకా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

రాయచూరు సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని రిలయన్స్ మాల్ ఎదురుగా ఉన్న క్రికెట్ బెట్టింగ్ అడ్డాపై బుధవారం పోలీసులు దాడి చేసి నిర్వాహకుడిని అరెస్టు చేశారు. గత కొంతకాలంగా ఇక్కడ పూల వ్యాపారం చేస్తున్న నవాబ్ గడ్డాకు చెందిన ఖాలిద్ అనే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న నేతాజీ నగర్ పోలీసులు బుధవారం దాడి చేసి నిర్వాహకుడి వద్ద నుంచి రూ.2 వేలతో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం ఆధారంగా క్రికెట్ బెట్టింగ్ ఎప్పటి నుంచి జరుగుతోందని, ఎంతమంది ఇందులో భాగస్వాములుగా ఉన్నారని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బసవరాజ్ నాయక్ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులను ఎస్పీ పుట్టమాదయ్య అభినందించారు.



పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మకు లలితాదేవి అలంకారం



కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం



హంబావిలో దుర్గాదేవికి శాకంబరి అలంకారం



కౌల్‌బజార్‌లోని పెద్దమ్మతల్లికి దుర్గాదేవి అలంకారం

పలు రూపాల్లో అమ్మవారి దర్శనం

బళ్లారి సిటీ/కంప్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం మూడవ రోజు నవరాత్రుల మహోత్సవంలో అమ్మవార్లు వివిధరూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మకు లలితాదేవి అలంకారం. ఎస్ఎల్‌వీ(లక్ష్మీవెంకటేశ్వర) కల్యాణ మంటపంలో అమ్మవారికి అన్నవరం సత్యనారాయణ స్వామి అలంకారం. కన్నకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం. హంబాబిలోని దుర్గామాతకు శాకంబరీదేవి అలంకారం, విద్యనగర్‌లోని అమ్మవారికి దుర్గాదేవి అలంకారం. కౌల్‌బజార్‌లోని పెద్దమ్మ తల్లికి దుర్గాదేవి అలంకారం. హొస్పేట్ రోడ్డులోని సంతోషి మాతకు అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకాంతో అమ్మవార్లు దర్శనం ఇచ్చారు. రాత్రిసమయంలో వివిధ ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యంగిరా దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



అన్నపూర్ణదేవి శివుడి రూపంతో ప్రత్యేక పూజలు

యువతరం అన్వేషణ పట్ల మక్కువ పెంచుకోవాలి

● డాక్టర్ సవితా సోనాలి

బళ్లారి సిటీ, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): యువత కొత్తవిషయాలను అన్వేషించడం పట్ల మక్కువ పెంచుకోవాలని రావు బహద్దూర్ మహబలేశ్వర్ ఇంజనీరింగ్ (ఆర్‌వైఎంసీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సవితా సోనాలి



జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సవితాసోనాలి

సూచించారు. నగరంలోని కంటోన్మెంట్ ఆర్‌వైఎంసీ కళాశాల ఆడిటోరియంలో ర్యాంప్ పథకం కింద పరిశ్రమలు, వాణిజ్య శాఖ, జిల్లాపారిశ్రామిక కేంద్రం, ఇంక్యుబేషన్ ప్రాజెక్టుపై నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌వైఎంసీ కళాశాల మొత్తం 12 ఇంక్యుబేషన్ కార్యకలాపాలను నిర్వహించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కళాశాలకు గరిష్ఠంగా రూ.3లక్షల ప్రోత్సాహకాలు అందాయని అన్నారు. ఇంక్యుబేషన్ సౌకర్యాలు, విజయగాథల గురించి వారికి అవగాహన కల్పించారు. పరిశ్రమలో విజయవంతమైన వ్యవస్థాపకులు కేవీటీ ఇండస్ట్రీస్‌కు చెందిన వీరేంద్రకుమార్ పాల్గొని పరిశ్రమను ప్రారంభించడంపై తన అనుభవాలను విద్యార్థులు, వ్యవస్థాపకులతో పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్, ఆర్‌వైఎంసీ మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కోరి నాగరాజ్, న్యాయ సలహాదారు సుజాత లక్ష్మేశ్వర, పేటెంట్ సెల్ అధిపతి శరత్ కుమార్, పీజీ కోఆర్డినేటర్ తోటప్ప, సోమనాథ్ స్వామి, వీరేశ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుబలను ఎస్టీలోకి చేర్చరాదు

బళ్లారి రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కురుబ కులాన్ని ఎస్టీలోకి చేర్చే ప్రయత్నం ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేస్తున్నారని, దీనిని వ్యతిరేకించాలని కర్ణాటక వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మప్ప జోళదరాసి పిలుపునిచ్చారు. నగరంలోని పత్రికా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీలోకి కురుబలను చేర్చడం వల్ల వాల్మీకులకు అన్యాయం జరుగుతుందని, విద్యార్థులు నష్టపోతారన్నారు. సెప్టెంబరు 22న దావణగేరె జిల్లా రాజ్యనల్లి పీఠాధిపతి ప్రసన్నానంద స్వామీజీని కలిసి వారి ఆదర్శంతో నిర్ణయంపై 25న ఉదయం కాకి పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సండూరు, కంప్లి, సిరుగుప్ప, బళ్లారి, బళ్లారి రూరల్ వాల్మీకి కుల బాంధవుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర



మాట్లాడుతున్న వాల్మీకి ఒక్కూట సంఘం నాయకులు

ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పీడీ హళ్లి జనార్దన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ముద్దమల్లయ్య, రుద్రప్ప, అడ్వకేట్ జయరాం, ఎర్రగుడి గోపాల్, కప్పగల్ రామాంజనేయులు, నారాయణస్వామి, శివలింగ, దుర్గప్ప, బసవరాజు, వాల్మీకి కుల బాంధవులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

సిరుగుప్ప, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు నెలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ సూచించారు. బుధవారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో నారీ శక్తి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రసవ సమయంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోగాలు సోకకుండా వుండేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు నాగప్రియ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు మహమ్మద్ ఖాసీం

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● సహకార సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి

కంప్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక కృషిపత్తిన సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు మృతిచెందితే వారి కుటుంబాలను ఆదుకుంటామని సొసైటీ అధ్యక్షుడు గుండాల యర్రిస్వామి తెలిపారు. కుడితిని పట్టణంలోని ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం ఏర్పాటు చేసిన మహాజన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం 2024-25 నాటి లెక్క పత్రాలను కార్యదర్శి ఆంజనేయ పద్మశాలి చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోనే అత్యుత్తమ సహకార సంఘంగా కుడితి



బాధిత కుటుంబానికి రూ.50వేల చెక్కును అందిస్తున్న అధ్యక్ష ఉపాధ్యక్షులు

నికి దక్కిందని తెలిపారు. సంఘంలో 3120 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రంగంపైన రుణాలు, రైతులు 1077 మంది జిల్లాలోని ఏ సహకార సంఘంలో క్షేమాభివృద్ధి పథకం సహకార సంఘంలో వుండే సభ్యులే సమావేశం ఏర్పాటు చేసుకుని బీడీసీసీ బ్యాంకులో నిర్ణయాన్ని అమలుపరచుకుని వచ్చామని తెలిపారు. రూ.50 వేలతో మొదలైన పథకానికి యేటా రూ.పది వేలు, రూ.50 వేలకు అదనంగా పెంచుతామన్నారు. రైతులు 1077 మంది కుటుంబాల్లో ఎవరు మృతి చెందినా వారికి ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఐదు సంవత్సరాల పాటు సభ్యులకు అందుబాటులో వుంటుందని తెలిపారు. గతంలో సిద్దమ్మనహళ్లి గ్రామానికి చెందిన వన్నెల హనుమంతు కుటుంబానికి కుడితిని కరిబసమ్మ కుటుంబానికి వేణి వీరాపురం గ్రామం చెందిన తిప్పేస్వామి కుటుంబానికి ఒకరికి రూ.50వేలు చొప్పున చెక్కులను అందించామన్నారు. గతంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఐదుగురిని మాత్రమే సన్మానించి నగదు పురస్కారం అందించేవారు. ప్రస్తుతం ఎనిమిది మందికి అందిస్తున్నామన్నారు. 2024-25 ఏళ్ల నాటికి రూ.6.60 లక్షల లాభాల బాటలో కొనసాగుతోందని తెలిపారు. ఐదేళ్ల పాటు ప్రతి ఒక్క సొసైటీ సభ్యులు మనస్పర్ధలు వదిలి అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. ఉపాధ్యక్షుడు షణ్ముఖ, అనిల్, టి. బసవరాజు, పరశురామ్, గౌడ్‌కి నాగలింగాచారి కోరి మర్రిస్వామి, చంద్రహాస్, ముల్లంగి ఛాయాదేవి, నాగమ్మ, శశికళ, అధికారులు నాసర్ హుస్సేన్, నాగభూషణం పాల్గొన్నారు.

రేబిస్‌ను నివారించండి: డాక్టర్ శోభ



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శోభ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేబీస్ ప్రాణాంతకమైన వ్యాధి, కుక్క కరిస్తే బాధితుడు విస్మరించకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో టీకాలు వేయించుకోవాలని మిల్లర్‌పేట నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శోభ సూచించారు. మిల్లర్‌పేట నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హనుమాన్ నగర్ ప్రాంతంలో కుక్కకాటు వల్ల వచ్చే రేబీస్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కుక్క కాటువేసిన ప్రదేశాన్ని శుభ్రమైన నీటితో, సబ్బుతో కడగాలన్నారు. రక్తస్రావం అవుతుంటే వీలైనంత త్వరగా ఆపడానికి సున్నితంగా నొక్కాలన్నారు. అనంతరం సమీపంలోని ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు శరత్, చేతన్, సోమశేఖర్, ఆశా వర్కర్లు తాయమ్మ, నవీన్, శ్రుతి పాల్గొన్నారు.

మానవ హక్కుల కార్యాలయం ప్రారంభం



వేగమేషాచౌదరిని సన్మానిస్తున్న సంఘం పదాధికారులు

బళ్లారి రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈడిగ హాస్టల్ సమీపంలో రాష్ట్రీయ మానవహక్కుల కర్ణాటక కార్యాలయాన్ని సౌత్ ఇండియా ప్రెసిడెంట్ వేగమేష చౌదరి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన హక్కుల సంఘం పలువురికి అండగా వుంటూ సంఘ సంస్థలకు సహాయం చేయాలని, ఆపదలో ఉన్న మహిళలకు తమ సంఘం అండగా వుంటుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు పుష్ప, స్టేట్ జనరల్ రాఘవేంద్ర స్టేట్ ప్రెసిడెంట్ వెంకటేష్, ముఖ్య అతిథి కేఎం మహేశ్వరస్వామి, ఇండియా ప్రెసిడెంట్ వేగమేష్ చౌదరిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కమలాపురం యూనిట్ అధికారిగా పరశురాం



పరశురామ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కంప్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కమలాపురం హోంగార్డు యూనిట్ అధికారిగా పరశురాం బాధ్యతలు చేపట్టినట్లు జిల్లా కమాండర్ బసవరాజు తెలిపారు. కమలాపురం యూనిట్ ఖాళీగా వుండటంతో ఆ స్థానంలో పరశురాంను నియమించినట్లు తెలిపారు. బుధవారం హోంగార్డు బృందం ఆయనను సన్మానించారు. పరశురాం మాట్లాడుతూ అధికారులు నియమించిన విధుల్లో హోంగార్డు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే హోంగార్డు శాఖకు గుర్తింపు వస్తుందన్నారు. వారితో పాటు వచ్చిన హోస్పేట యూనిట్ అధికారి గిరీష్, కమలాపురం హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రగతి అత్యవసరం: విద్యాధికారి



ప్రతిభా పురస్కార కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

సిరుగుప్ప, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో విద్యాప్రగతి అత్యవసరమని విద్యాశాఖాధికారి గురప్ప తెలిపారు. బుధవారం సిరుగుప్పపట్టణం అభయాంజనేయ ఆలయంలో సర్వ చైతన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహిత్యం, సంగీతం, కళ, విద్యలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభాపురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం ముందడుగు వేయాలంటే విద్య అత్యవసరమని తెలిపారు. సాహిత్యం, సంగీతం, భాష అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా మరియోగ స్వాములు, చైతన్య ఫౌండేషన్ అధ్యక్షులు ఖాసీమ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వెంకోబ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

రాయచూరు సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం విజయదశమి రోజు నిర్వహించే దసరా ఉత్సవాలను జిల్లా కేంద్రంలో వైభవంగా నిర్వహించాలని మహానగర పాలికె సభ్యులు తీర్మానించారు. బుధవారం మహానగర పాలికె చైర్‌పర్సన్ నరసమ్మ మాడగిరి అధ్యక్షతన ప్రత్యేకంగా సమావేశమైన సభ్యులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా మక్కా దర్వాజా వద్ద కవిగోష్ఠి నిర్వహించాలని, ప్రముఖ కవులు, సాహితీవేత్తలను ఆహ్వానించాలని తీర్మానించారు. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కళాకారులను రప్పించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలన్నారు.

న్యాయసేవపై అవగాహన పెంచుకోవాలి

● జిల్లా న్యాయాధికారి హెచ్ఎన్ సాత్విక్

రాయచూరు సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవా ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్ఎన్ సాత్విక్ సూచించారు. చట్టాలపై అవగాహనతో పాటు న్యాయసేవ కార్యక్రమాలు తద్వారా అందుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకోవాలన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయనమాట్లాడారు. కార్మికులకు చట్టపరంగా దక్కాల్సిన హక్కులు ప్రభుత్వ పరంగా పొందే సంక్షేమ పథకాల ప్రయోజనాలు తదితర వాటిపై వివరించారు. ఈ దిశగా కార్మిక శాఖ అధికారులు ఇతర అధికారులు సమన్వయంతో వారికి అవగాహన కల్పించాలన్నారు. చట్టపరంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం న్యాయసేవ ప్రాధికార తనవంతు తోడ్పడుతుందని అన్నారు.



కార్మికులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న న్యాయాధికారి

హోసూరు జోన్

నగర స్వచ్ఛతపై సీఎం ప్రశంసలు

● పలు తీర్మానాలు ఆమోదం : మేయర్ సత్య

హోసూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఈనెల 11, 14 తేదీలలో హోసూరును సందర్శించినవేళ నగర స్వచ్ఛతపై ప్రశంసలు లభించాయని ఇందుకు కౌన్సిల్ సభ్యుల పర్యవేక్షణ, అధికారులు, సిబ్బంది కారణమని మేయర్ సత్య వెల్లడించారు. హోసూరు మునిసిపల్ కార్పొరేషన్ నెలవారీ సమావేశం బుధవారం జరిగింది. మేయర్ సత్య అధ్యక్షత వహించగా డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కమిషనర్ మహ్మద్ షబ్బీర్ ఆలం పాల్గొన్నారు. కార్పొరేషన్‌లో 28మంది కొత్త అధికారులను మేయర్ నియమించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నియామకానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. హోసూరు నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడం ద్వారా ముఖ్యమంత్రినుంచి ప్రశంసలు లభించాయని మేయర్ తెలిపారు. కాంగ్రెస్ సభ్యురాలు ఇంద్రాణి మాట్లాడుతూ నగరంలో వీధికుక్కల బెడద అధికమైందని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డీఎంకే సభ్యుడు మాదేశ్వరన్ మాట్లాడుతూ హోసూరు బస్టాండ్‌లోని మరుగుదొడ్లలో శుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇతర సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బుధవారం సర్వసభ్య సమావేశంలో 168 తీర్మానాలను ఆమోదించినట్టు మేయర్ ప్రకటించారు.



కౌన్సిల్ సమావేశంలో నగర మేయర్ సత్య తదితరులు

కోటమారియమ్మన్ ఆలయంలో విశేష పూజలు

హోసూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని ప్రసిద్ధ స్వయంభూ కోట మారియమ్మన్ ఆలయంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణగిరి జిల్లాలో హోసూరు, బాగలూరు, సూలగిరి, డెంకణీకోట్టై, తళి, అంచెట్టి తదితర ప్రాంతాలలో దసరా వేడుకలు సంబరంగా సాగాయి.



ఇసుక అక్రమ రవాణా

● 3 లారీలు స్వాధీనం

హోసూరు (క్రైం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేరండపల్లి సర్వీస్ రోడ్డుపై తహసీల్దార్ గుణశివ నేతృత్వంలో అధికారులు గస్తీ నిర్వహించారు. అక్రమంగా పార్కింగ్ చేసిన 2 టిప్పర్ లారీలలో 8 యూనిట్ల ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా తొట్టమెత్తై గ్రామ పరిపాలనాధికారి సెందిల్‌కుమార్, అధికారులు గస్తీ నిర్వహిస్తున్న వేళ టిప్పర్ లారీలో 4 యూనిట్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఉత్తనపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇలా రెండు వేర్వేరు ప్రదేశాల్లో తనిఖీల సందర్భంగా 3 ఇసుక లారలను సీజ్ చేశారు.

ఉపాధి పనులు సమర్థవంతంగా నిర్వహించాలి

● జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ

రాయచూరు సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలని జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ సూచించారు. ఇందుకోసం ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరం పీడీఓలు, తాలూకా పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ పనుల ఏపీఓలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గతంలో నిర్వహించిన పనులు ప్రస్తుత అవసరానికి అనువైన పనుల నిర్వహణకు సంబంధించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. తద్వారా పనుల్లో ఎలాంటి నాణ్యత ప్రమాణాలకు ఇబ్బంది లేకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు.